సంక్షేమ వారధులు వలంటీర్లు

• ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి


సన్మానం పొందిన వలంటీర్లతో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, పైలా నరసింహయ్య

బుక్కరాయసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన వలంటీర్ల వ్యవస్థ ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి వలంటీర్లే వారధులని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని షర్డీసాయి కల్యాణ మండపంలో జెడ్పీటీసీ భాస్కర్ అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. కరోనా లాంటి క్లిష్ట సమయంలో ప్రాణాలకు తెగించి పని చేశారని కొనియాడారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను కులమత, రాజకీయం భేదం లేకుండా అన్ని వర్గాలకు వలంటీర్లు అందిస్తున్నారన్నారు. కోట్లాది రుపాయలు ప్రభుత్వం అందిస్తున్నా ఎక్కడా ఒక్క పైసా కూడా అవినీతి లేకుండా ప్రజలకు చేరుతోందన్నారు. దేశంలో ఇతర రాష్ట్రాలు వలంటీర్ల వ్యవస్థ వైపు చూస్తున్నాయన్నారు. ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అదే విధంగా రాష్ట్రంలో ఇంత పెద్ద మొత్తంలో అభివృద్ధి జరుగుతున్నా ఎల్లో మీడియాలో తప్పుడు రాతలు చంద్రబాబు రాయించడం సిగ్గు చేటన్నారు. పథకాలు ప్రజలకు ఉచితంగా ఇవ్వరాదని ఎల్లో మీడియాలో కథనాలు రావడం సిగ్గు చేటన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వలంటీర్లకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, ఎంపీడీఓ విజయభాస్కర్, సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఆలూరి రమణారెడ్డి, బీసీ సెల్ నాయకులు రమేష్‌గౌడ్, వైఎస్సార్ సీపీ మహిళావిభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, ఎస్సీసెల్ అధ్యక్షుడు ఎగ్గుల శ్రీనివాసులు, పెన్నోబిలేసు, ఈఓఆర్డీ దామోదరమ్మ, వైస్ ఎంపీపీలు రామగోపాల్, జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్, బీకేఎస్ సర్పంచ్ పార్వతి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు

యాడికి: సంక్షేమ పథకాలను పేదల వద్దకు చేర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న వలంటీర్లు సంక్షేమ సారథులని ఎంపీపీ బొంబాయి ఉమాదేవి అన్నారు. చందన, లక్షుంపల్లె, కోనుప్పలపాడు, గుడిపాడు, చిక్కేపల్లె, నిట్టూరు గ్రామాల్లోని సచివాలయ వలంటీర్లకు బుధవారం పురస్కారాలు అందజేశారు. ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, వైస్ ఎంపీపీ చెన్నప్ప, ఎంపీటీసీ నాగరాజు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, గుడిపాడు సర్పంచు దండు సావిత్రి వలంటీర్ల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : వలంటీర్లు అంకితభావంతో పని చేయాలని ఎంపీపీ శ్రీదేవి, చిన్నవడుగూరు సర్పంచ్ వెంకటరమణారెడ్డి, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి సూచించారు. బుధవారం చిన్నవడుగూరు చిట్టూరు గ్రామ సచివాలయాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే

• ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి


ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి సంఘీభావం తెలిపేందుకు వచ్చిన మహిళలు

తాడిపత్రి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని మళ్లీ రాబోయేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. బుధవారం కొట్టాలపల్లి మీదుగా కొనగుంటపల్లి, దిగువపల్లి, ఎగువపల్లి ప్రజా సంక్షేమయాత్ర కొనసాగింది. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం లభించింది. అనంతరం గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రతి వీధి తిరుగుతూ ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా రాష్ట్రాన్ని నడిపిస్తున్నారన్నారు. ఆయన పాలనలో ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, జగనన్నకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే ఇలా తమ గ్రామాలకు పాదయాత్ర చేపట్టి, ప్రజా సమస్యలను తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ పాలనను వివరించడం ఎన్నడూ చూడలేదని ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. తాడిపత్రి నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన వివరించారు. అనంతరం మండలంలో ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు పురస్కారాలు అందజేశారు.

సంక్షేమ యాత్రకు సంఘీభావం

ప్రజా సంక్షేమ యాత్రకు కొనగుంటపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్యే చేపడుతున్న యాత్ర నియోజకవర్గంలో ప్రజల గుండెల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతోందని పైలా పేర్కొన్నారు. ప్రజలకు అన్ని వేళలా అండగా ఉండే నాయకుడు కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్న నమ్మకాన్ని ఆయన యాత్ర ద్వారా నిరూపిస్తున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. సర్పంచ్ ఎద్దుల వెంకట్రామిరెడ్డి, జెడ్పీటీసీ రమణమ్మ, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు, మార్కెట్ యార్డు చైర్మన్ హరినాథ్‌రెడ్డి, యర్రగుంటపల్లి ఎంపీటీసీ కిషోర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, పాపిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యాకానుక కిట్ల పరిశీలన


కిట్ల నాణ్యతను పరిశీలిస్తున్న డీఏఓ చంద్రనాయక్


శింగనమల: స్థానిక ఎమ్మార్సీ భవనంలో బుధవారం జగనన్న విద్యాకానుక కిట్లను జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన ఎంఈఓ నరసింహరాజుతో మండలంలో ఎంత మంది విద్యార్థులున్నారు, ఎన్ని జగనన్న విద్యాకానుక కిట్లు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. విద్యాకానుక కిట్ల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. కిట్లు సకాలంలో విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓను ఆదేశించారు.

రైళ్లపై రాళ్లు విసరడం నేరం


ధర్మవరం గేట్ సమీపంలోని యువతతో మాట్లాడుతున్న జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు

గుంతకల్లు: నడిచే రైళ్లపై రాళ్లు విసురుతూ ప్రయాణికులు గాయపరచడం వంటి చర్యలు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జీఆర్‌పీ ఎస్‌ఐ మహేంద్ర హెచ్చరించారు. ఇటీవల ఎస్‌జేపీ హైస్కూల్, ధర్మవరం గేట్ ఏరియా, పీఅండ్‌టీ కాలనీల సమీపంలో కొందరు ఆకతాయిలు రన్నింగ్ రైళ్లపై రాళ్లు విసురుతూ ప్రయాణికులను గాయపరిచిన సంఘటనలు జరిగాయి. దీనిపై బుధవారం ఆయా ఏరియా సమీపంలోని యువతకు రైళ్లపై రాళ్లు విసిరితే జరిగే పరిమాణాలపై జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.

వాటర్ కూలర్ వితరణ


వాటర్ కూలర్ అందజేస్తున్న ఫయాజ్‌బాషా

తాడిపత్రి అర్బన్: వేసవిని దృష్టిలో ఉంచుకుని స్థానిక ఐటీఐ కళాశాలకు వైఎస్సార్‌సీపీ నేత, ఫయాజ్‌బాషా ట్రస్టు చైర్మన్ ఫయాజ్ రూ.17 వేలు విలువజేసే వాటర్ కూలర్‌ను అందజేశారు. బుధవారం కూలర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ పి.ప్రసాద్‌కు అప్పగించారు. అధ్యాపకులు ఎం.రవికుమార్, శాంతకుమారి, ఎం.రత్నాకర్, రాంబాబు, వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు షాషావలి, ఉపాధ్యక్షుడు మహబుబ్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు చవ్వా రాజశేఖర్ రెడ్డి, ఆలూరు ప్రసాద్, హెచ్.జునైద్, మౌలాలి, నూరి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ముస్లింల అంత్యక్రియలు నిర్వహించేందుకు కావలసిన సబహన్(మృతదేహానికి స్నానం చేయించడానికి)ను బషీర్ అనే వ్యక్తి ఫయాజ్ బాషా ట్రస్టుకు అందజేశారు.

‘జగనన్నకు చెబుదాం’తో సత్వర పరిష్కారం

యాడికి: జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ అలెగ్జాండర్ అన్నారు. మండలంలోని సచివాలయాల కార్యదర్శులు, సిబ్బందితో బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ఎంపీడీఓ సమావేశ భవనంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. విభాగాల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలపై చర్చించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు.

హజ్ యాత్రికులకు నిధుల విడుదల హర్షణీయం


మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్

గుంతకల్లుటౌన్: హజ్ యాత్రికులపై పడుతున్న అదనపు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తూ రూ.14.51 కోట్లు విడుదల చేయడం హర్షణీయమని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్, కౌన్సిలర్ జేసీబీ చాంద్‌బాషా, వార్డు సచివాలయాల కన్వీనర్ ఖలీల్ తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఏపీకి చెందిన 1,813 మంది హజ్ యాత్రికుల మీద పడిన అదనపు భారాన్ని భరించాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించినా ఎటువంటి స్పందన లేదన్నారు. ఒక్కో హజ్ యాత్రికుడిపై పడిన అదనపు ఆర్థిక భారం రూ.83 వేలు చెల్లించాలని సీఎం జగన్‌ను డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌లాజం కోరిన వెంటనే ఆయన స్పందించి తక్షణమే రూ.14.51 కోట్ల సాయాన్ని విడుదల చేయడాన్ని ముస్లింలెవ్వరూ మరిచిపోరన్నారు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, కౌన్సిలర్లు మెహరున్నీసా, సుమోబాషా, కోఆప్షన్‌సభ్యులు ఫ్లయింగ్ మాబు, నూర్‌నిజామి, మైనార్టీ సెల్ పట్టణ కార్యదర్శి ఎంబీ.మౌలా, వార్డు ఇన్‌చార్జులు యూనస్, మస్తాన్, నాయకులు చాంద్‌పీరా, అక్రమ్, ఖలీఫా, నూర్, షాబుద్దీన్, మన్సూర్ పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి


సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

యల్లనూరు: జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యేకు మహిళలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాలనలోనే ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్నారు. చంద్రబాబు హయాంలో కరువు కాటకాలతో రాష్ట్రం అతలాకుతలం అయిందన్నారు. 2024లో మళ్లీ జగనన్ననే సీఎం చేసుకుందామన్నారు. ఈసందర్భంగా పలువురు డ్రైనేజీలు, రోడ్లు, పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో చర్చించి పరిష్కరిస్తామనడంతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి, సర్పంచులు అశోక్‌కుమార్‌రెడ్డి, పెద్ద ఓబులమ్మ, సచివాలయాల మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కల్లూరు ప్రతాప్‌రెడ్డి, కొత్తపల్లి పురుషోత్తంనాయుడు, జాఫర్, ఓబులేసు, రంగనాథ్, మూర్తి, రమణ, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

మండల కేంద్రంలో గురువారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. అలాగే మండల కేంద్రంలో సచివాలయం-2 భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

మండలం కేంద్రానికి చెందిన జయన్న రూ.60 వేలు, శింగవరం గ్రామానికి చెందిన మధు ప్రసన్నకు రూ.35 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అందజేశారు.

సంక్షిప్త సమాచారం

ఇసుక లారీ సీజ్

తాడిపత్రి అర్బన్: సజ్జలదిన్నె వద్ద బుధవారం ఇసుక లారీని పట్టుకున్నట్లు సెబ్ అధికారి విజయ్ కుమార్ తెలిపారు. నిందితుడు కుమ్మర విష్ణువర్దన్ రెడ్డి అరెస్ట్ చేసి లారీని సీజ్ చేశామన్నారు.

పెద్దవడుగూరు : కొండూరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను బుధవారం సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేశామన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: జక్కలచెరువులో ఓ వ్యక్తి బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన దేవేంద్ర భార్య రెండు రోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. ఇంటికి రావాలని భార్యను ఫోన్‌లో కోరాడు. అయితే భార్య రాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన అతడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు సేవించాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భూసర్వేలో భాగస్వాములు కావాలి

గుంతకల్లు రూరల్: మండలంలో తలపెట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష సర్వేలో రైతులు భాగస్వాములు కావాలని తహసీల్దార్ రాము కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గురువారం దంచర్ల, నక్కనదొడ్డి గ్రామాల్లో గురువారం నుంచి సర్వే ప్రారంభించనున్నట్లు తెలిపారు.

గుత్తి రూరల్: మండలంలో బుధవారం ప్రారంభమైన భూముల రీ-సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ మహబూబ్ బాషా కోరారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు.

యాడికి: మండలంలోని కుందన కోట, ఓబుళాపురం, వేములపాడు, నగరూరు, కమలపాడు, రాయలచెరువు, తూట్రాళ్లపల్లె, పుప్పాల, కోనుప్పలపాడు, చందన, యాడికి రెవెన్యూ గ్రామాల్లో జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంపై గురువారం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అలెగ్జాండర్ బుధవారం తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో వసతులు కల్పించాలి

గుత్తి: గుత్తి పోర్టు రైల్వే స్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ డిమాండ్ చేశారు. గుత్తి పోర్టు రైల్వే స్టేషన్‌ను బుధవారం ఆయన పలువురు సీపీఐ నాయకులు, కార్యకర్తలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు ఉండటానికి షెడ్ ఏర్పాటు చేయాలని, తాగునీటి సదుపాయం కల్పించాలని, ప్రస్తుతం రెండు రైళ్లు మాత్రమే ఆగుతున్నాయని మరిన్ని రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతపురం , సత్యసాయి జిల్లాల కార్యదర్శులు జాఫర్, వేమయ్యయాదవ్, గుత్తి మండల కార్యదర్శి రామదాసు, సీనియర్ నాయకులు రమేష్, డానియేల్, డోలక్ షఫి, రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

డాక్టర్ మౌనికకు సన్మానం


మౌనికకు ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

శింగనమల: శింగనమల పశుసంవర్ధక శాఖ డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలో పని చేస్తున్న డాక్టర్ మౌనికను ఉన్నతాధికారులు సన్మానించారు. పశువులకు అపరేషన్లు చేయడంలో ఉత్తమపనితీరు కనబర్చడంతో బుధవారం విజయవాడలో శాఖ డెరెక్టర్ డాక్టర్. అమరేంద్రకుమార్ మౌనికకు ప్రశంసాపత్రం అందజేశారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం, డీడీ డాక్టర్. రమేష్‌రెడ్డి, శింగనమల ఏడీ పద్మనాభం, సిబ్బంది డాక్టర్ మౌనికను అభినందించారు.

వృద్ధురాలికి తీవ్ర గాయాలు

పుట్లూరు: ఏ.కొండాపురంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. అరకటివేములకు చెందిన లక్ష్మమ్మ రోడ్డు పక్కనే పండ్లు అమ్ముతూ జీవనం సాగిస్తోంది. బుధవారం తాడిపత్రి నుంచి ఏ.కొండాపురం వైపుకు వస్తున్న ఆటో లక్ష్మమ్మపైకి దూసుకెళ్లడంపై ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను ఆసుపత్రికి తరలించారు.

ఆర్బీకేలకు చేరిన విత్తన వేరుశనగ

యాడికి: మండలంలోని ఆర్బీకేలకు విత్తన వేరుశనగ సరఫరా చేస్తున్నామని ఏఓ మహబూబ్ బాషా పేర్కొన్నారు. బుధవారం రాయలచెరువు, పుప్పాల ఆర్బీకేలకు విత్తన వేరుశనగ కాయలు వచ్చాయని, నాణ్యత బాగుందని ఏఓ తెలిపారు. ఖరీఫ్ ప్రారంభం నాటికి ఆర్బీకేల్లో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతామన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు


మహిళలకు పథకాలను వివరిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమపథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 8వ వార్డు బంకమడివీధి, ఓం శాంతినగర్‌లో బుధవారం సాయంత్రం జన చైతన్య యాత్ర కార్యక్రమం జరిగింది. వార్డు నాయకులు అంబటి రాఘవేంద్రారెడ్డి, గౌస్‌తో కలసి హర్షవర్ధన్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజలను పేరుపేరునా ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరించాలని సచివాలయ వార్డు సెక్రటరీలు, వలంటీర్లకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా అహర్నిశలూ కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్లు బాబు, వరదలయ్య, నాయకులు ప్రసాద్, గణేష్, బాబా, లక్ష్మీరంగయ్య, కేశవరెడ్డి, మనోజ్ కాశీ తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి


ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయభాస్కర్

బుక్కరాయసముద్రం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ విజయ భాస్కర్ లబ్ధిదారులను కోరారు. బుధవారం సిద్దరాంపురం రోడ్డు సమీపాన ఉన్న జగనన్న కాలనీలో పర్యటించారు. కాలనీలో త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. కాలనీల్లో లబ్ధిదారులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని హౌసింగ్ అధికారులను సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. హౌసింగ్ ఏఈ రాజఖర్‌రెడ్డి, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఏపీఓ శ్రీదేవి, ఈసీ ప్రసాద్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి రూరల్: కొత్తపేట గ్రామ శివారులోని జగనన్న లేఔట్‌లో బుధవారం అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ మల్లికార్జున మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో ఇంటి పట్టాలు పొందిన వారు త్వరగా గ్రౌండింగ్ చేయించుకొని ఇంటి నిర్మాణాలను ప్రారంభించాలన్నారు. అనంతరం పట్టాలు మంజూరైన వారికి స్థలాలను చూపించి గ్రౌండింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. వైస్ ఎంపీపీ సుద్దల తిరుపాలమ్మ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మన్సూర్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ నేతలు సుద్దల రాముయాదవ్, సుధాకర్, ఓబుళప్ప, గంగరాజు, ప్రకాష్ పాల్గొన్నారు.

దళితుల ద్రోహి చంద్రబాబు


మాట్లాడుతున్న జింకల రామాంజనేయులు

గుంతకల్లుటౌన్: దళితులుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా అని తమ పుట్టుకనే అవమానపరిచిన దళిత ద్రోహి చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజనేయులు విమర్శించారు. బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళిత, గిరిజనులకు ఉప ముఖ్యమంత్రుల పదవులివ్వడమే కాకుండా తమకు అన్ని రంగాల్లోనూ సముచిత స్థానం కల్పించిన దళిత, గిరిజనుల పక్షపాతి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. జగనన్నపై దళితద్రోహి అనే పుస్తకాన్ని టీడీపీ ప్రచురించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాజధానిలో దళిత,గిరిజనుల భూములు లాక్కొని వారి కడుపుకొట్టిన దుర్మార్గుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. చంద్రబాబు పాలనలో దళిత, గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. యువగళం పాదయాత్ర నిర్వహిస్తున్న చంద్రబాబు తనయుడు నారా లోకేష్ కూడా కర్నూలు జిల్లా పర్యటనలో దళితులు ఏం పీకారంటూ అనుచిత వ్యాఖ్యలు చేసి తమ మనోభావాలను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిలర్ సుధాకర్, మాజీ కౌన్సిలర్ రంగన్న, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి జి.బావన్న, పట్టణ అధ్యక్షుడు ప్రతాప్, సచివాలయాల మండల కన్వీనర్ గోవింద్‌నాయక్, వార్డ్ ఇన్‌చార్జ్‌లు వీరేష్, పరుశరాముడు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జూపూడి రాక

పామిడి: పామిడికి గురువారం ఏపీ రాష్ట్ర ప్రభుత్వ సామాజిక సలహాదారు జూపూడి ప్రభాకర్‌రావు రానున్నట్లు మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు పామిడి కేవీ చలపతి బుధవారం తెలిపారు. ఆయన స్థానిక బైబిల్ మిషన్ సభలో పాల్గొంటారన్నారు. అనంతరం వజ్రకరూరు మండలం కొనకొండ్లలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని కలువనున్నట్లు చెప్పారు.

ప్రభుత్వ ఉద్యోగుల దీక్ష

గుంతకల్లు రూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గుంతకల్లు తాలూకా శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు దీక్ష చేపట్టారు. ప్రతినెలా 1న జీతం డబ్బు ఖాతాల్లో జమ చేయాలని, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని,1993 నవంబర్ 25న నియమితులైన ఎస్ఎంఆర్, డైలీ వేజెస్, కంటింజెంట్ ఉద్యోగులను తక్షణమే రెగ్యులర్ చేయాలని కోరారు.

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయాలి

బుక్కరాయసముద్రం: ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభలను వెలికితీయాలని ఆర్డీటీ డైరెక్టర్ దశరథ్ పేర్కొన్నారు. బుధవారం సిద్దరాంపురం రోడ్డు సమీపాన ఉన్న ఆర్డీటీ బధిరుల హైస్కూల్‌లో రెండు రోజుల పాటు సృజన-2023 సెంట్రల్ లెవల్ కల్చరల్ ఉత్సవాలు ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మండల వైద్యాధికారి స్వాతి లక్ష్మి, ఆర్డీటీ డైరెక్టర్లు, బధిరుల పాఠశాల హెచ్ఎం ఎర్రిస్వామి పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

పెద్దవడుగూరు: విద్యుత్ తెగి పడడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు సమీపంలోని మైనింగ్ వద్ద బుధవారం ఉదయం డోలమైట్ రాయిని అన్‌లోడ్ చేస్తుండగా పైనున్న విద్యుత్ తీగలను టిప్పరు తాకింది. ఘటనలో షాక్‌కు గురైన టిప్పర్ డ్రైవర్, యాడికి మండలం పెద్దపేట నివాసి షేక్షావలి (దౌలాబాషా) తీవ్రంగా గాయపడ్డాడు. 11కేవీ విద్యుత్ తీగలు తెగిపడడంతో టిప్పర్‌కు మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది. క్షతగాత్రుడిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు బెంగళూరు కు తీసుకెళ్లారు.

నేడు ప్రజా సంక్షేమ యాత్ర

తాడిపత్రి టౌన్: ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గురువారం దిగువపల్లి, ఎగువపల్లి, తెరన్నపల్లి, తిమ్మాపురం, రావివెంకటాంపల్లి, యర్రగుంటపల్లి గ్రామాల్లో ప్రజా సంక్షేమాయత్ర చేపట్టనున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

ఆధార్ మొబైల్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

గుంతకల్లుటౌన్: ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పులతో పాటు కొత్త ఆధార్‌కార్డులు కావాల్సిన వారు పట్టణంలోని ఆయా వార్డు సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ మొబైల్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని సూచించారు. బుధవారం పట్టణంలోని 28వ వార్డులో ఆధార్ మొబైల్ క్యాంప్‌ను ఆమె ప్రారంభించారు.

వ్యక్తి ఆత్మహత్య

పామిడి: పట్టణంలో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఒక రోజు ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక చైతన్యకాలనీకి చెందిన నాగరాజు (40) నాగరాజు కూలీ పనులు చేసుకుంటూ తన భార్య నారాయణమ్మ, ఇద్దరు కుమార్తెలను పోషించేవాడు. ఇద్దరు కుమార్తెలకు పెళ్లి చేశాడు. ఇటీవల భార్యభర్తల మధ్య కలహాలు అధికమయ్యాయి. దీనికి అనారోగ్యం తోడవ్వడంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో లారీ డ్రైవర్ వీరంగం

తాడిపత్రి: మద్యం మత్తులో ఓ లారీ డ్రైవర్ బుధవారం తాడిపత్రిలో వీరంగం సృష్టించాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బళ్లారి నుంచి నెల్లూరుకు ఐరన్ ఓర్‌ను తరలిస్తున్న లారీ డ్రైవర్ విరూపాక్షి మద్యం మత్తులో ఐశ్వర్య విల్లాస్ వద్ద ఒక్కసారిగా ఎడమ వైపు నుంచి కుడివైపు రోడ్డులోకి దూసుకెళ్లాడు. ఆ సమయంలో రహదారి పక్కనే ఉన్న టిఫెన్ బండి వద్ద దాదాపు 13 మంది వరకు ఉన్నారు. వారి పక్కనుంచే లారీ దూసుకెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆగిపోయింది. విద్యుత్ లైన్లు తెగి పడ్డాయి. ఆ పక్కనే ఉన్న స్కూటీ వాహనం ధ్వంసమైంది. సమాచారం అందుకున్న తాడిపత్రి రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు.